క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమితులైన బొమ్మి ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీలు ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్ఏలకు మినహాయింపు ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘ నాయకులు

ముమ్మిడివరం: ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ నుంచి వీఆర్ఏలకు మినహాయింపు ఇవ్వాలని కోనసీమ వీఆర్ఏల సంఘం నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విన్నవించుకున్నారు. వయోభారంతో సాంకేతిక పరిజ్ఞానం, విద్యార్హత లేనివారు, నామినీలుగా పనిచేసేవారు ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ వేయడంలో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకే ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్‌కు మినహయింపునివ్వాలని కోరారు. కార్యక్రమంలో కోనసీమ వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు దాడి వీరభద్రం, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, ఎం.సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

అన్నదాతకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక అన్నదానం టీమ్ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్జానీ(జానీ)ని ఇమ్మిడివరప్పాడు మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రతి గురువారం జానీ బృందం ఆ వృద్ధాశ్రమానికి వెళ్లి వృద్ధులకు క్రమం తప్పకుండా కొన్నేళ్లుగా భోజనాలు పెడుతున్నారు. వృద్ధాశ్రమం 19వ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు విక్టర్ తదితరులు జానీని సత్కరించారు.

ఉచిత డయాబెటీస్ వైద్య శిబిరం



భీమనపల్లిలో నిర్వహించిన ఉచిత డయాబెటీస్ వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: భీమనపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అమలాపురం వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటీస్ వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ బాదం బాలకృష్ణ, జిల్లా ప్రాజెక్టు చైర్మన్ అనీల్‌కుమార్ చేతుల మీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి వంద మందికి షుగర్ పరీక్షలు, 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ, కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, పంపన సూర్యతేజ, బూరగాయల శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయాలి

అల్లవరం: 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసి పంచాయతీలను ఆదుకోవాలని అల్లవరం మండల సర్పంచ్ సమాఖ్య తీర్మానించింది. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు అధ్యక్షతన మంగళవారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో నిధులు లేక గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, తక్షణమే 14, 15 ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయాలని వెంకటరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాకారపు చిరంజీవిరావు, తిక్కిరెడ్డి శ్రీను, సుందరనీడి సాయి, రొక్కాల విజయలక్ష్మి, రాకాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది బకాయి జీతాల విడుదల

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న మున్సిపల్ సిబ్బంది బకాయి వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం యానాం మున్సిపల్ సిబ్బందికి 7 నెలల బకాయి జీతాలు రూ.3.50 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకుందని, త్వరలో దానికి సంబంధించిన జీఓ విడుదల అవుతుందని చెప్పారు.

ఆపరేషన్ పరివర్తన్

- సారా విక్రేతలను సన్మార్గంలో పెట్టేందుకు ప్రభుత్వ పునరావాస పథకం
- ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కోసం రుణాలు
- సత్ఫలితాలిస్తున్న పరివర్తన కార్యక్రమం



పరివర్తన ద్వారా ప్రారంభించిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈబీ సీఐ భవానీ



నాటు సారా విక్రేతలకు పరివర్తన కార్యక్రమం ద్వారా చెక్కులు అందజేస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్ బాబు

తాళ్లరేవు: సరైన పనిలేక, పెట్టుబడి పెట్టేందుకు ఆర్థిక స్తోమత లేక అక్రమ వ్యాపారాల బాట పట్టిన వారిని సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలతో కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నవారెందరో ఉన్నారు. అలాంటివారిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కోసం పరివర్తన కార్యక్రమం పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తున్నారు. ఇది క్షేత్రస్థాయిలో సత్ఫలితాలనిస్తుంది.

సారా తయారీ, అమ్మకాలు సాగించేవారిని మంచి మార్గంలో నడిపించి సారా రహిత గ్రామాల్ని తయారుచేయడమే పరివర్తన కార్యక్రమం అసలు లక్ష్యం. ఈ క్రమంలోనే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖాధికారులు సారా ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సారా తయారీ, విక్రయాల కారణంగా ఎంతోమంది కేసుల బారిన పడిన జైలు పాలవుతున్నారు. అక్రమంగా సారా విక్రయాల వచ్చే ఆదాయం కన్నా పట్టుబడినప్పుడు సదరు కేసులు, బెయిల్ల కారణంగా కోల్పోతున్నదే ఎక్కువ. ఈ విషయాన్ని తెలియజెప్పుతూ గతంలో సారా కేసుల్లో పట్టుబడినవారికి ప్రత్యామ్నాయ ఉపాధిగా టిఫిన్ సెంటర్, పాన్ షాపు, కిరాణా దుకాణం, గేదెలు, ఆవులు, గొర్రెల పెంపకం కోసం బ్యాంకుల నుంచి ఎలాంటి హామీ లేకుండానే రుణాల్ని ఇప్పిస్తామని ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అంతేకాదు స్వయం ఉపాధికి ముందుకొచ్చేవారికి వారు ఎంచుకున్న రంగాన్ని బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తున్నారు.

మార్పు మొదలైంది

పరివర్తన కార్యక్రమం ద్వారా ఇంతకాలం చీకటిలో మగ్గిన నాటుసారా వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ సహకారంతో బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలతో సరికొత్త జీవనోపాధిని వెతుక్కుని తమ కుటుంబాల్ని పోషించుకుంటున్నారు. ఒకప్పుడు భయపడుతూ బతకాల్సి వచ్చేదని, ఇప్పుడు పదిమందిలో గౌరవంగా బతుకుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరివర్తన కార్యక్రమం ద్వారా ఒక్క కాకినాడ జిల్లాలోనే నాటుసారా వ్యాపారం వదిలేసిన 60 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కోసం రూ.41 లక్షల మేర రుణాల్ని మంజూరు చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఏడుగురికి, తాళ్లరేవు ఎస్ఈబీ పరిధిలోని మండలాల్లో ఎనిమిది మందికి ఈ పునరావాస పథకం ద్వారా లబ్ధి చేకూరింది.

నాకు కొత్త జీవితాన్నిచ్చారు



సారా విక్రయిస్తూ జీవితాన్ని వెళ్లదీసే నాకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూ.1 లక్ష ఆర్థిక సాయం చేసింది. ఆ సొమ్ముతో మా ఇంటి వద్దే కిరాణా దుకాణాన్ని ప్రారంభించాను. దుకాణం ద్వారా వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తూ పిల్లల్ని బాగా చదివించుకుంటున్నాను.

– పెంకే భవానీ, తాళ్లరేవు

చీకటి జీవితాల్లో వెలుగులు నింపేందుకే



అక్రమ వ్యాపారంలో మగ్గుతున్న వారిని గుర్తించి మంచి దారిలో పెట్టేందుకు ప్రభుత్వం పరివర్తన కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తుంది. ఇప్పటివరకు తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ప్రత్నామ్నాయ జీవనోపాధి కోసం రుణాలు తీసుకున్న వారిలో కొందరు కిరాణా దుకాణాలు నడుపుతుండగా, మరికొందరు పాడి పరిశ్రమతో జీవనం సాగిస్తున్నారు.

– జేవీ భవానీ, సీఐ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, తాళ్లరేవు

నేడు తెప్పోత్సవం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణ వద్ద మేళ తాళాలతో, వేద ఘోషతో స్వామివారిని, అమ్మవారిని భద్రపీఠంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం వృద్ధ గౌతమీ నదికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంస వాహనంపై స్వామి వారిని, అమ్మవారిని నదీ విహారానికి తెప్పోత్సవం చేస్తారు. తెప్పోత్సవానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ లక్ష్మీనారాయణలు చెప్పారు. మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన భాగవతార్ హరికథ, రాజమండ్రికు చెందిన పిల్లలు చేసిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

గడువు ప్రకారం ఎన్నిక నిర్వహించాలి

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం గడువు మార్చి 31తో ముగుస్తున్న నేపథ్యంలో నూతన పాలకవర్గం ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కోపరేటివ్ స్టోర్స్‌లో సభ్యత్వం తీసుకోవడానికి రూ.1500 విలువచేసే సరకులను కొనుగోలుచేసి, దాని బిల్లు సైతం ఉండాల్సి ఉంటుందన్నారు. అయితే సభ్యత్వం దక్కకుండా చేయడానికి కొన్ని నెలల నుంచి కోపరేటివ్ స్టోర్స్‌లో కొనుగోళ్లపై బిల్లులు ఇవ్వకుండా చేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై ఎల్జీకి సైతం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మాగాపు సుబ్బారావు, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: గ్యాస్ సిలెండర్ లీకై తాటాకిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని విలసవిల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వీఆర్వో అహ్మద్ ఆలీషా కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాసిన శ్రీనివాసరావు, అతని భార్య, కుమార్తె, దివ్యాంగులైన ఇద్దరు కుమారులతో కలసి ముప్పల మహాలక్ష్మమ్మకు చెందిన తాటాకింట్లో ఒకపక్క అద్దెకు ఉంటున్నారు. మరోపక్క మహాలక్ష్మమ్మ నివాసముంటోంది. కొన్ని రోజుల క్రితం మహాలక్ష్మమ్మ తన బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గ్యాస్ సిలెండర్ లీకై ఇంట్లో మంటలు చెలరేగాయి. గదంతా పొగ కమ్మేయడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటకు వచ్చేశారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినప్పటికీ ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. శ్రీనివాసరావు చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిలో ఉన్న రెండు కుటుంబాల సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఇటీవలే శ్రీనివాసరావు తమ పిల్లల పింఛను కోసం తెచ్చిన సదరన్ సర్టిఫికెట్, విలువైన పత్రాలు, కాలి బూడిదయ్యాయి. ఎవరికీ గాయాలు తగలనప్పటికీ, సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని వీఆర్వో అహ్మద్ ఆలీషా తెలిపారు. బాధిత కుటుంబాలకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, రెవెన్యూ అధికారులు నిత్యావసర సామగ్రిని అందించారు.

ఎస్‌బీ ఖాతాల ఓపెనింగ్‌కు మహామేళా



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ సలాది శ్రీధర్

అల్లవరం: అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలోని పోస్టాఫీస్ కార్యాలయంలో ఈ నెల 24 వరకు పీఓ ఎస్‌బీ ఖాతాలు ప్రారంభించడానికి మహామేళా నిర్వహిస్తున్నామని అమలాపురం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ సలాది శ్రీధర్ మంగళవారం తెలిపారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో అల్లవరం, బెండమూర్లంక, పేరూరు, సమనస పోస్టాఫీస్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ప్రతి పోస్టల్ ఉద్యోగి కనీసం 50 ఎస్‌బీ కొత్త ఖాతాలను తెరిచేలా చూడాలన్నారు. మహామేళాని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వి.వంశీ, మెయిల్ వార్సిల్ బసవా అనీల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన వెంకన్న కల్యాణోత్సవాలు



సర్ప వాహనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: యానాంలో కొలువైన చారిత్రక భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణమహోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామవినోద్ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, రాట ముహూర్తం చేశారు. మార్చి నెల 16వ తేదీ వరకు జరిగే వివిధ వాహనోత్సవాలకు కల్యాణోత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. కల్యాణోత్సవాల్లో భాగంగా బెజవాడ బాపన్ననాయుడు వారి మనుమలచే నిర్వహించిన సర్పవాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వాహనోత్సవానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొని స్వామికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, ఎస్ఆర్ఎంటీ మూర్తి, పులవర్తి శ్రీను, నిరంజనరావు పాల్గొన్నారు.

అమలాపురం నుంచి కాకినాడకు కార్ల ర్యాలీ

నామినేషన్ దాఖలుకు ఊరేగింపుగా తరలివెళ్లిన కుడుపూడి



నామినేషన్ దాఖలు నిమిత్తం అమలాపురం నుంచి కాకినాడకు బయలుదేరిన కార్ల ర్యాలీ

అమలాపురం టౌన్: ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎంపికైన కుడుపూడి సూర్యనారాయణరావు నామినేషన్ దాఖలు చేసేందుకు మంగళవారం అమలాపురం నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు ఊరేగింపుగా వెళ్లారు. పెద్ద ఎత్తున కార్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. నామినేషన్ దాఖలు చేసేందుకు కాకినాడకు బయలుదేరే ముందు సూర్యనారాయణరావు తన తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ, తన పినతండ్రి, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు, తన తల్లిదండ్రులైన గోపాలకృష్ణ గోఖలే ఐపీఎస్, మహాలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాతయ్య మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నందుకు కుడుపూడి సూర్యనారాయణరావును అభినందిస్తూ శెట్టిబలిజ నేతలు, పార్టీ నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కాకినాడ వెళ్లిన సూర్యనారాయణరావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాలతో సత్కరించి అభినందించారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తిరువీధి రథోత్సవం



మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవంలో రథాన్ని లాగుతున్న మహిళలు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామంలో భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి తిరువీధి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక షిర్డీ సాయిబాబా వారి ఆలయం నుంచి గ్రామ ఆడపడచులు రథాన్ని లాగుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి రథోత్సవానికి మహిళా భక్తులు పసుపు నీళ్లు, మంగళ హారతులతో గ్రామంలోకి స్వాగతం పలికారు. బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పులు, గరగ నృత్యాలతో గ్రామ పుర వీధుల్లో రథోత్సవం కన్నుల పండువగా సాగింది.

విద్యాలయాలకు పూర్వ విద్యార్థుల విరాళం



ఎస్‌కేబీఆర్ కళాశాల అభివృద్ధికి రూ.3 లక్షలు అందజేస్తున్న 50 ఏళ్ల నాటి పూర్వపు విద్యార్థులు

అమలాపురం రూరల్: తాము చదువుకున్న విద్యాలయాలకు పూర్వ విద్యార్థులు తమ వంతు విరాళం అందించి కృతజ్ఞతను చాటారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో 1970–72 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ బయాలజీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అదే కళాశాలలో 50 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో ఒకే వేదికపైకి వచ్చి అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విశ్రాంత జీవితాన్ని సాగిస్తున్న వారంతా కళాశాల అభివృద్ధి కోసం రూ.3 లక్షలు సమకూర్చి ఆ చెక్‌ను కళాశాల పాలక మండలి చైర్మన్ ఎస్.సుబ్బరాజు, సభ్యుడు డీఎస్ఎన్ రాజులకు అందజేశారు. చెక్ ఇచ్చినవారిలో పూర్వ విద్యార్థులైన అమలాపురం విశ్రాంత డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గంధం రామం, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోదశి గంగరాజు, అదే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ వెంకటపతిరాజు తదితరులు న్నారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువు జెడ్పీ పాఠశాలలో 1988–89 సంవత్సరాల పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.1.70 లక్షలు విరాళాలు సేకరించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, కమిటీ చైర్మన్ వీరి శ్రీనివాసరావులకు మంగళవారం అందజేశారు. సొమ్ము అందించినవారిలో అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శిరిగిబత్తిన రాజరాజేశ్వరి, రాజులపూడి ఆనంద కుమార్, భీమన రామకృష్ణరావు, ఉర్రింకి రమేష్ తదితరులున్నారు.

కనులకు అందం.. కవలల బంధం



కవల సోదరీమణులు నళినిశ్రీ-భాగ్యశ్రీ



కవల సోదరీమణులు సరస్వతి-లక్ష్మి



కవల సోదరీమణులు హర్షిత-వర్షిత

కవలల దినోత్సవం సందర్భంగా...

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్: ఒకే రూపంతో ఉన్న ఇద్దరు పిల్లలు ఒకే ఇంట్లో తిరుగుతుంటే ఆ తల్లిదండ్రుల అనుభూతే వేరు.. అచ్చం ఒకేలా ఉన్న ఆ ఇద్దరిని చూసి బంధువులు, స్నేహితులు తికమక పడుతుంటే నవ్వొస్తుంది. కవలల దినోత్సవం సందర్భంగా అమలాపురంలో కొన్ని కవలల జంటలు, వారి కుటుంబాలు కేక్ కట్ చేయించి వేడుక జరుపుకుంటారు. అమలాపురం రూరల్ మండలం బండార్లంకలో దాదాపు 20 మందికి పైగా కవల పిల్లలు ఉన్నారు. అమలాపురం నియోజకవర్గంలో సుమారు 110 మంది వరకూ కవల పిల్లలున్నారు.

- అమలాపురం పట్టణంలో దొమ్మేటివారి కాలనీకి చెందిన హెల్త్ అసిస్టెంట్ వైఎస్ఎస్ ప్రసాద్, విజయదుర్గ దంపతుల కవల పిల్లలు హర్షిత-వర్షిత ఇద్దరూ ఒకేలా ఉంటారు. వారిద్దరూ ఐదో తరగతి చదువుతున్నారు.
- అమలాపురం పట్టణం సీతాపతిరావుపేటకు చెందిన వడ్రంగి మేస్త్రి యాళ్ల బుజ్జి, సత్యవేణి దంపతుల కవల పిల్లలు నళినిశ్రీ, భాగ్యశ్రీలు ఇద్దరూ అచ్చు గుద్దినట్లు ఒకేలా ఉంటారు. వారు ఆరో తరగతి చదువుతున్నారు.
- అమలాపురం కుళాయి చెరువు మున్సిపల్ పార్కు ప్రాంతంలో బ్యాంక్ అధికారి యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, రామతులసి దంపతుల కవల కుమార్తెలు సరస్వతి, లక్ష్మిలు సైతం ఒకేలా ఉంటారు. ఇద్దరూ బీటెక్ చదివారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



జవహర్ నవోదయలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం



సాహిత్య సభలో మాట్లాడుతున్న శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి



సదస్సులో మాట్లాడుతున్న దృశ్య, కళల అకాడమీ చైర్‌పర్సన్ సత్య శైలజ

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో వక్తల పిలుపు

అమలాపురం టౌన్: మాతృ భాష పరిరక్షణ అందరి బాధ్యతని, దాని కోసం ప్రజలంతా తెలుగులోనే మాట్లాడి భాషను కాపాడుకోవాలని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యనగర్‌లోని కడలి కళా నిలయంలో శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం, తెలుగు అధ్యాపక సంఘం సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన సాహిత్య సభలో నరసింహమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా ఔత్సాహిక కవులకు నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలకు విశ్రాంత పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు బహుమతులు అందజేశారు.

మాతృభాషను వారసత్వ సంపదగా అందించాలి

అమలాపురం రూరల్: మాతృభాష అమృతతుల్యమని, బాల్యం నుంచి పిల్లలకు మాతృభాషపై ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర దృశ్య, కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు వైభవం సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర భాషల్లో ప్రావీణ్యం పొందాలంటే మాతృభాష భాషను పరిపూర్ణంగా అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వడలి రాధాకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, కుడిపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: మాతృభాష తల్లిలాంటిదని దాని ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవోదయలో అమలవుతున్న త్రిభాషా సూత్ర ప్రాధాన్యతను ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఆర్ సాంబశివరావు వివరించారు.

ఐ.పోలవరం: సాంస్కృతిక జీవన వెలుగులకు మాతృభాషలే పునాదులుగా నిలుస్తాయని పలువురు సాంస్కృతిక అభిమానులు పేర్కొన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని ఐ.పోలవరంలో తెలుగు వెలుగుల పేరుతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పీటీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నీస్ బుక్ రికార్డు పొందిన గాయకులు తిరుక్కో వల్లూరి రామన్‌కు గరికపాటి రాజారావు కళాకౌముది అవార్డును ప్రదానం చేశారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు సత్తి సత్యకృష్ణ అధ్యక్షతన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తెలుగు సేవాదళం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ రాక

అమలాపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ 23వ తేదీ గురువారం కోనసీమలో పర్యటిస్తారని ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. గురువారం ముమ్మిడివరం శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు, అనంతరం ఈదరపల్లిలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో జరిగే విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తారని ఈఈ రవికుమార్ చెప్పారు.

PUBLIC NOTICE

Kusuma Sadish kumar S/o Vipparayya D No4-77, Daba Garden, Nadipudi, Amalapuram Mandal, Dr BR Ambedkar Konaseema Dist applied for loan from M/s. Shriram Finance Ltd., Chennai having branch office at Amalapuram Branch the security of the schedule mentioned property of Kusuma Jyothi W/o Vipparayya If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day.

Daba Gardens Area, Amalapuram

1. Z Dry, RS No 152/1,2,3 an extent of 113 sq yds out of 228.84 sq yds in plot No 49 out of full ac 2.50 cents is bounded by

East: Canal road, South: Site of Kollu Nageswara Rao, West: Land of Kusuma Jyothi, North: Site of Sanaboina people

In between the above boundaries with an R C C residential building therein bearing D No with doors, doorways, electrical fittings etc and with all easement rights etc., therein

2. Z Dry, RS No 152/1,2,3 an extent of 220.18 sq yds in plot No 48 is bounded by

East: Site in plot No 49 18.5 meters, South: Site in plot No 51 10 meters, West: site in plot No 47 18.5 Meters, North: road 10 meters

In between the above boundaries with an R C C G+1 residential building therein bearing D No 2-397 with doors, doorways, electrical fittings etc and with all easement rights etc., therein.

Date: 21-2-2023 **DVVS Murthy**
Advocate Amalapuram. 98483-44577

